క్లుప్తంగా

ముమ్మరంగా రోడ్డు నిర్మాణ పనులు



దాచేపల్లి: నారాయణపురం- నడికుడి రోడ్డు నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం కేటాయించిన రూ.3.50 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమణలు తొలగించి డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. తాజాగా రోడ్డుపై తారు పనులు చేశారు. బంగ్లా సెంటర్ నుంచి నడికుడి రైల్వేస్టేషన్ వరకు తారు వేశారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రోడ్డు విస్తరణ పనులపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారు.

ఒప్పిచర్లలో ఇల్లు దగ్ధం



కారెంపూడి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ఒప్పిచర్లలో ఇంట్లో పొలం పనులకు వెళ్లిన సమయంలో పూరింట్లో షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఇంట్లో ఉన్న వంట సామగ్రి, దుస్తులు, ఇంట్లో ఉన్న మిగిలిన సొత్తు కాలిపోయింది. బాధితుడు సురతాని నాగాంజి మాట్లాడుతూ ఇంట్లో డ్వాక్రా రుణం డబ్బులు రూ.50 వేలు కూడా కాలిపోయాయని తెలిపాడు. ఈ ఘటనపై రెవెన్యూ అధికారులు విచారణ చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గురజాల: ప్రమాదం తృటిలో తప్పింది. నగర పంచాయతీ పరిధిలోని గాంధీబొమ్మ సెంటర్‌లో రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని వాహనం ఢీకొనడంతో స్తంభం కిందపడిపోయింది. ఆ ప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని యథాస్థితిలోకి ఏర్పాటు చేశారు.

పోలేరమ్మకు బోనాలు సమర్పణ

గురజాల: మండల పరిధిలోని అంబాపురంలోని పోలేరమ్మ తల్లికి భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం అమ్మవారి కొలుపుల్లో భాగంగా దేవాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం కుంకుమ బళ్ల కట్టి మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచి పాశం హనిమిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు వేలమూరి సైదారెడ్డి, పాశం పాపిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తల్లి కొలుపులు

గురజాల: నగర పంచాయతీలోని రెడ్డి బండ్ల సమీపంలోని ముత్యాలమ్మ తల్లి కొలుపులు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొక్కుబడులు ఉన్న వారు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు ఉత్సవంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం సమయంలో నిర్వహించిన శిడిమాను ఉత్సవం వైభవోపేతంగా నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో ప్రత్యేక సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దీక్షా ధారణ సందర్భంగా ప్రత్యేక స్వామివారిని అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో సురేష్ మృతదేహం

పిడుగురాళ్ల: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణ శివారులోని కోర్టు సమీపంలో సురేష్(30) ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొట్టింది. అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పల్నాటి ప్రజల వరప్రదాయిని.. వరికపూడిశెల

- సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలుకుదాం
- ప్రభుత్వ విప్ పీఆర్కే, ఎంపీ లావు, పీవీఆర్



దుర్గి నాయకులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, ఎంపీ లావు, పీవీఆర్

దుర్గి: కొన్ని దశాబ్దాలుగా పల్నాడు రైతాంగం ఎదురుచూస్తున్న వరికపూడిశెల ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం రానున్నట్లు వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. మాచర్ల రాక సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, వైఎస్సార్ సీపీ మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ అధికార పర్యటనకు విచ్చేస్తున్నారని చెప్పారు. వరికపూడిశెల ప్రాజెక్టు శంకుస్థాపన చేసి త్వరితగతిన నిర్మాణం చేసి రైతుల కలను నిజం చేస్తున్నాడన్నారు. గత టీడీపీ హయాంలో మంత్రి హోదాలో నారా లోకేష్ మాచర్ల నియోజక వర్గాన్ని దత్తత తీసుకుంటానని, వరికపూడిశెలను పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధమవుతానని ప్రగల్భాలు పలికి ఈ ప్రాంత ప్రజలను, రైతులను మోసం చేసిన చరిత్ర వారిదని పేర్కొన్నారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని, రైతులకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి రైతు బాంధవుడుగా నిలిచారని కొనియాడారు. రేపు జరగబోయే బహిరంగ సభకు ప్రజలు, రైతులు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ ఆయా గ్రామాలలోని రైతులను, పార్టీ కార్యకర్తలను సభకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని, అదే విధంగా సీఎం జగన్‌కు జన నీరాజనంతో పల్నాడు పౌరుషాన్ని తెలిపే విధంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, ఎంపీపీ ఏసూరి సాయి శంకర్, జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద, వైస్ ఎంపీపీలు ఊరిబండి యేగయ్య, చల్లా శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కటకం రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నం పెద్దబ్బాయ్, కటకం చిన వెంకటయ్య, యకటీల బుచ్చిబాబు, తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకట్రామయ్య, ఊరిబండి మన్నెయ్య, జక్కా రమేష్, బొబ్బా సీతారామిరెడ్డి, మద్దికర శ్రీనివాస రెడ్డి, శెట్టిపల్లి కోటేశ్వరరావు, మాదాసు వాసు, బొంతా కృష్ణ, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

భూగర్భ జలాల లభ్యతపై సర్వే



బోరుబావిలో నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న వాటర్ ఎయిడ్ ఇండియా బ్లాక్ కో-ఆర్డినేటర్ గురుప్రసాద్

విజయపురిసౌత్: మాచర్ల మండలం పశువేములలో వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో వాటర్ సెక్యూరిటీ బడ్జెట్ ఎక్సర్‌సైజ్ ప్రారంభించినట్లు బ్లాక్ కో-ఆర్డినేటర్ మాడెబోయిన గురుప్రసాద్ తెలిపారు. సోమవారం పశువేముల గ్రామంలో బోరు బావులలో నీటిమట్టాన్ని పరిశీలించారు. ఆయన మండల పరిధిలో పశువేములతో పాటు బ్రహ్మానందపురం తండా, రాయవరం, తుమ్మేపల్లి గ్రామాలలో మొత్తం ఎంత మంది జనాభా ఉన్నారు, పెంపుడు జంతువులు ఎన్ని ఉన్నాయో గుర్తించి నీటి వినియోగం ఎంత జరుగుతుందో తెలుసుకోవటంతో పాటు గ్రామాలలోని పొలాలకు సాగు నీరు ఎన్ని లక్షల లీటర్ల నీరు అవసరం ఉంటుందని విషయం ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకోవటం జరుగుతుందని చెప్పారు. ఆయా గ్రామాలకు బోరు బావులు, కాలువల ద్వారా, వర్షం ద్వారా ఎన్ని లక్షల లీటర్ల నీరు అందుబాటులో ఉన్నాయో లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. వినియోగించే నీటి కంటే తక్కువ నీరు అందుబాటులో ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీరు వినియోగం కంటే ఎక్కువ శాతం నీరు ఉంటే వాటిని సంరక్షణ చేసే పద్ధతులు ఈ కార్యక్రమం ద్వారా చేపడతామన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఫెసిలిటేటర్ రవివర్మ, సర్పంచి కిన్నెర దేవదానం, వలంటీర్లు కర్రా విజేత, రోజా రాణిపాల్గొన్నారు.


రజక ఆత్మగౌరవ మహాసభను జయప్రదం చేయండి



బ్రాహ్మణపల్లిలో చలో గుంటూరు గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

పిడుగురాళ్ల రూరల్: రజకులకు చట్ట సభల్లో అవకాశాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘం ఐక్యవేదిక లీగల్ సెల్ అధ్యక్షుడు కంభంపాటి కోటేశ్వరరావు కోరారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, జానపాడు, పందిటివారిపాలెం, పెద అగ్రహారం, కామేపల్లి తదితర గ్రామాల్లో రజక ఆత్మగౌరవ మహాసభ వాల్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ గుంటూరులో నిర్వహించనున్న రజక ఆత్మగౌరవ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పల్నాడు రజక సంఘ నాయకులు బలుగూరి రామారావు, సీతారామయ్య, నాసరయ్య, చిన్న వెంకటేశ్వర్లు, వెంకటేవ్వర్లు, బలుగూరి సీతరామయ్య పాల్గొన్నారు.

కార్తిక ఆకాశ దీపోత్సవాలు



ధ్వజస్తంభానికి ఏర్పాటు చేసిన ఆకాశ దీపం

రొంపిచర్ల: మండలంలోని అన్ని దేవాలయాల్లో సోమవారం రాత్రి ఆకాశ దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్తిక మాసం విష్ణుమూర్తికి, శివునికి ఎంతో ప్రీతికరమైన మాసం. ఈ మాసం ప్రారంభం కాగానే అన్ని దేవాలయాల్లో ధ్వజస్తంభాలకి ఆకాశ దీపం ఏర్పాటు చేస్తారు. కార్తిక దీపం, ఆకాశ దీపానికి అవినాభావ సంబంధం ఉంది. చిన్ని చిన్న రంధ్రాలు చేసిన ఓ గుండ్రని ఇత్తడి పాత్రలో నూనె పోసి దీపాన్ని వెలిగించి తాడు సహాయంతో ధ్వజస్తంభం పై భాగాన వేలాడదీస్తారు. ఈ దీపాన్ని దర్శించుకోవడానికి భక్తులు దేవాలయానికి వెళ్లారు. ఈ దీపం ఆకాశ మార్గాన ప్రయాణించే పితృదేవతల కోసమని శాస్త్రాలు చెబుతున్నాయి. కార్తిక శుద్ధ పాడ్యం నుంచి పితృదేవతలు అంతా ఆకాశ మార్గాన తమ తమ లోకాలకు ప్రయాణిస్తుంటారు. ఆ సమయంలో వారికి మార్గం సరిగా కనిపించడం కోసం ఆలయాల్లో ఆకాశ దీపాన్ని వెలిగిస్తారని పండితులు చెబుతారు.

పెన్షనర్స్ గదులను తక్షణమే ఖాళీ చేయాలి

అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతాపరెడ్డి

సత్తెనపల్లి: లీజు సమయం పూర్తయినప్పటికీ గదులను ఖాళీ చేయకుండా పెన్షనర్స్‌ను ఇబ్బందులు పెడుతున్న లీజుదారుడు జవ్వాజి సాంబశివరావు తక్షణమే గదులు ఖాళీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యెరువ ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం విలేకరులు సమావేశం నిర్వహించారు. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ అక్రమంగా ఉంటున్న గదులను వెంటనే ఖాళీ చేయాలని, పెన్షనర్లకు జరిగిన అన్యాయాన్ని పరిష్కరించాలన్నారు. పెన్షనర్లపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకొని, పెన్షనర్లకు న్యాయం చేయాలన్నారు. అక్రమంగా నడుస్తున్న పయనీర్ ఆటో మొబైల్ షాపును వెంటనే మూసివేయాలని కోరారు. లేకుంటే ఈనెల 15న పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజలు సహకరించి తమకు మద్దతు పలకాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు రామారావు, బాధ్యులు రొంపిచర్ల పురుషోత్తం, పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారి అదృశ్యం



పెదకూరపాడు: ప్రముఖ వ్యాపారి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరుకు ఆతుకూరి వెంకటేశ్వర్లు ఫ్యాన్సీ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీ ఆరోగ్య సమస్యలపై హైదరాబాద్ వెళ్లి వస్తానంటూ కారులో వెళ్లాడు. కారును గుంటూరు రైల్వే స్టేషన్‌లో పార్కు చేసి హైదరాబాద్ వెళ్లాడు. ఇప్పటికి తిరిగిరాకపోడడం, ఫోను కూడా స్విచ్ ఆఫ్ ఉండడంతో కుటుంబ సభ్యులు బంధువులను, స్నేహితుల వద్దకు వెళ్లి విచారించారు. సమాచారం లేకపోవడంతో కుమారుడు బాలసాయి కుమార్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు. వెంకటేశ్వర్లు వయసు 52 సంవత్సరాలు ఉంటాయని చెప్పారు. ఆచూకి తెలిసిన వారు 83282 09174, 92471 35262, 94407 96269 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రమాదం అంచున ప్రయాణం...



రెంటచింతలలో పరిమితిని మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

రెంటచింతల: ఆటో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కూలీలు పొలం పనుల కోసం ఆటోలలో 15 నుంచి 20 మంది ఎక్కి ప్రయాణిస్తున్నారు. మంచికల్లు, రెంటాల, మిట్టగుడిపాడు, పశర్లపాడు, గోలి, మల్లవరం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి రవాణ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

నేటి నుంచి సత్రశాలలో భక్తులకు అన్నదానం

రెంటచింతల: మండలంలోని సత్రశాల పురాతన శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తికమాసాన్ని పురస్కరించుకుని మంగళవారం నుంచి వివిధ స్వామిమాల ధారులకు, భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి గురుస్వామి తెలిపారు. సోమవారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 30 రోజుల పాటు దేవస్థానం సందర్శించుకునే భక్తులకు, మాలధారులకు వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు వేకువజాము నుంచి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గణపతి, రుద్ర హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవస్థానంలో అన్నదానం కార్యక్రమానికి చేయుతనిచ్చిన దాతలకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం మల్లికార్జునస్వామి వారి ప్రసాదాన్ని అందచేయనున్నట్లు బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో దేవస్థానం ఈఓ బుర్రి నెమలిరెడ్డి, ప్రధాన అర్చకులు చిట్టేలా శివశర్మ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రాజుపాలెం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయ అధికారి కేఎస్ఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన వారోత్సవాలు ప్రారంభం, 15వ తేదీన పుస్తక ప్రదర్శన, 16వ తేదీన ప్రముఖులను స్మరించుకోవడం, 17వ తేదీన కవి సమ్మేళనాలు, 18వ తేదీన వ్యాస రచన పోటీలు, 19వ తేదీన దిశ చట్టంపై అవగాహన కల్పించడం, 20వ తేదీన డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

బెల్లంకొండ మండలంలో..

బెల్లంకొండ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు మండల గ్రంథాలయ శాఖాధికారి షేక్ మహ్మద్ అలీ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వారోత్సవాలు సందర్భంగా శాఖా గ్రంథాలయంలో 20వ తేదీ వరకు ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్రోసూరు మండలంలో...

క్రోసూరు: స్థానిక గ్రంథాలయంలో మంగళవారం నుంచి వారం రోజుల పాటు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ సోమవారం తెలిపారు. వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

కార్తిక మాసోత్సవాలకు సమాయత్తం

- సత్తెనపల్లిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- పెద్ద సంఖ్యలో హాజరు కానున్న భక్తులు



పట్టణంలోని అచ్చంపేట రోడ్డులోని శివాలయం



వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో పూలతో అలంకరణ

సత్తెనపల్లి: పవిత్ర కార్తిక మాసోత్సవాలకు శైవక్షేత్రాలు ముస్తాబు అయ్యాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక క్యూ లైన్‌లతోపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 14వ తేదీ నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుండగా వేలాది మంది భక్తులు తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి శైవ క్షేత్రాలకు రానున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక పూజలకు వీలుగా ఆలయ ఆవరణలో ఏర్పాట్లు చేపట్టారు. స్వామికి నిత్యం అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని శివాలయం, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వర స్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంతో పాటు రైల్వే స్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయం, వడ్డవల్లిలోని శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు.


క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



పోటీలలో గెలుపొందిన చిన్నారులతో వైఎంసీఏ సభ్యులు

చిలకలూరిపేట: చిన్న వయసు నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని నరసరావుపేట సీడీపీఓ బి.మాణిక్యాలరావు చెప్పారు. వైఎంసీఏ చిలకలూరిపేట శాఖ ఆధ్వర్యంలో మండలంలోని దండమూడి గ్రామంలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎంసీఏ సంస్థ గ్రామీణ ప్రాంతాల చిన్నారులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం వలన భవిష్యత్తులో మంచి క్రీడాకారులు రూపొందుతారని కొనియాడారు. వైఎంసీఏ గౌరవ అధ్యక్షుడు చుక్కా విన్సెంట్‌పాల్, అధ్యక్షుడు కె.రామ్మోహన్‌రావు, కోశాధికారి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



గాయత్రి మృతదేహం

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండల కూచిపూడి అగ్రహారంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పెదపూడి కోదండ రామాలయం, గణపతి ఆలయంలో అర్చకునిగా పని చేసే పెనుమూడి స్వాతి కిరణ్‌కు, పల్నాడు జిల్లా సత్తెనపల్లి సమీపంలోని తాళ్లూరు గ్రామానికి చెందిన గాయత్రితో 2017 ఫిబ్రవరి ఆరో తేదీన వివాహమైంది. వివాహ సమయంలో ఎనిమిది నవర్సల బంగారం, మూడు లక్షల నగదును పసుపు కుంకుమ కింద ఇచ్చారు. వారికి ఆరేళ్ల కారుణ్య బాల, మూడేళ్ల ప్రణవ్, ఎనిమిది నెలల బాలుడు ఉన్నారు. గాయత్రి ఆదివారం అర్ధరాత్రి కూచిపూడిలోని తమ ఇంటిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని మృతి చెందింది. సోమవారం తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో స్వాతి కిరణ్ గుర్తించి ఇరుగు పొరుగువారికి సమాచారం ఇచ్చాడు. గాయత్రిని ఆమె భర్త స్వాతి కిరణ్, అతని కుటుంబ సభ్యులే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారంటూ మృతురాలి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. తరచూ అదనపు కట్నం కోసం వేధిస్తూంటాడని, ఇటీవల విజయవాడలో జరిగిన ఓ వివాహంలో గాయత్రి ఇదే విషయాన్ని తమ దగ్గర ప్రస్తావించిందని ఆమె బంధువు వాపోయారు. స్వాతి కిరణ్, అతని తల్లిదండ్రులు లలితకుమారి, బాబూరావు తన కుమార్తెను అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా హింసించడం వల్లే మృతి చెందిందని గాయత్రి తండ్రి పొత్తూరి మల్లేశ్వరరావు ఫిర్యాదు చేశాడని కూచిపూడి ఎస్‌ఐ డి.సందీప్ తెలిపారు. ఘటనా స్థలాన్ని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్, పామర్రు సీఐ వి.సుభాకర్ సందర్శించారు. బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. గాయత్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మండల మేజిస్ట్రేట్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ శవపంచినామా నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన వినుకొండ రూరల్ మండలం వెంకుపాలెం గ్రామం వద్ద ఆదివారం జరిగింది. వినుకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈపూరు మండలం ఊడిజర్ల గ్రామానికి చెందిన ఆనంద్‌బాబు (27) బొల్లాపల్లి మండలం సరికొండపాలెంకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆనంద్‌బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పోస్టుమార్టం అనంతరం ఆనంద్‌బాబు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రై సైకిల్ అందజేత

మాచవరం: మండలం కేంద్రమైన మాచవరంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మండలంలోని తురకపాలెం గ్రామానికి చెందిన వికలాంగురాలు షేక్ అస్మితా తనకు ట్రై సైకిల్ మంజూరు చేయాలని స్థానిక సర్పంచి షేక్ అల్లాభక్షు సహకారంతో దరఖాస్తు చేసుకుంది. స్పందించిన కలెక్టర్ వికలాంగురాలికి ట్రై సైకిల్ మంజూరు నిమిత్తం డీఎంహెచ్ఓకు ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఆమెకు ఆదివారం ట్రైసైకిల్‌ను అందజేశారు. వికలాంగుల కోటాలో పింఛన్ మంజూరు చేసినట్లు వెల్లడించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా తమ కుమార్తె సమస్యను పరిష్కరించిన ప్రభుత్వానికి, ప్రభుత్వ జిల్లా యంత్రాంగానికి అస్మిత తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

క్రోసూరు: స్థానిక మార్కెట్ యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి మద్దతు ధర రూ.7020కు కొనుగోలు చేస్తుందని చైర్మన్ వివరించారు. రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని, సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలోని విజయచైతన్య ఎంటర్ ప్రైజెస్ జిన్నింగ్ మిల్లుకు చేర్చుకొని విక్రయించుకోవచ్చునని పేర్కొన్నారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

సత్తెనపల్లి: మహిళలు కుట్టు మిషన్‌లు ఉపయోగించుకొని స్వయం శక్తితో ఎదగాలని యూకే టీమ్ ప్రతినిధులు అన్నారు. పట్టణంలోని సుందరయ్య కాలనీలో ఆప్ట్ చిల్డ్రన్ హోం సంస్థ అధ్వర్యంలో యూకే టీమ్ 15 మంది పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆప్ట్ సంస్థ నిర్వాహకులు గాత్రం రాఘవరావు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని, ప్రయాణికులతో వస్తున్న ఆటో ఢీకొంది. సంఘటనలో బాపట్ల జిల్లా కారుమంచి గ్రామానికి చెందిన వెంకటప్పయ్యతో పాటు మరో బాలుడికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఏరియా వైద్యశాలకు తరలించారు.





